# అప్రమత్తతే మందు..

- జీవాలు ప్రమాదానికి గురైతే ఆందోళన వద్దు
- ప్రథమ చికిత్సతో ప్రాణపాయం దూరం



మూగ జీవాలకు చికిత్స చేస్తున్న పశువైద్య సిబ్బంది

భైంసాటౌన్, డిసెంబర్ 3 : పశువులు పాము కాటు, విద్యుత్ షాక్‌కు గురైనా, విషపూరిత పదార్థాలు తిన్నా రైతులు ఆందోళన చెందుతుంటారు. జీవాలకు మరణం సంభవిస్తుందని కంగారు పడతారు. కానీ అటువంటి సమయంలో సమయస్ఫూర్తి పాటించాలని పశుసంవర్ధక శాఖ అధికారులు సూచిస్తున్నారు. వెంటనే జీవాలకు ప్రథమ చికిత్స అందిస్తే ప్రాణపాయం నుంచి కాపాడుకోవచ్చని పేర్కొంటున్నారు. ఎటువంటి ప్రమాదం చోటుచేసుకున్న బాగా గాలి తగిలే ప్రాంతాల్లో ఉంచడం ముఖ్యమని సూచిస్తున్నారు.

**పాముకాటుకు గురైతే**

పచ్చికబయళ్లు, పొలం గట్లపై, నీటి కుంటల్లో పశువులు గడ్డి మేయడానికి వెళ్లే సమయంలో పాము కాటుకు గురవుతుంటాయి. పాము విషం శరీరంలోకి వెళ్లి రక్తప్రసరణ వ్యవస్థపై ప్రభావం చూపుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో పశువు చనిపోయే అవకాశం ఎక్కువగా ఉంటుంది. 90 నిమిషాల తర్వాత విషం ప్రభావం పశువులపై కనిపిస్తుంది. పశువు కింద పడిపోవడం, నోటి నుంచి నురగ రావడం, కళ్లు తేలియడం వంటివి కనిపిస్తాయి. అటువంటి సమయంలో పశువుకు పాము కాటు వేసిన చోట గట్టిగా ఒత్తడం వల్ల రక్తం బయటకు వచ్చేలా చేయాలి. అందుబాటులో టించర్ ఉంటే పాము కాటువేసిన ప్రమాదంలో వేయాలి. కాటుపై భాగంలో కట్టు గట్టిగా వేయాలి.

**విద్యుత్ షాక్‌కు గురైతే..**

పశువులు విద్యుత్ తీగలకు తగిలి ఎక్కువగా ప్రాణాలు కోల్పోతుంటాయి. ఈ ఘటనలు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి. హై వోల్టేజ్ షాక్‌కు గురైతే మృతి చెందుతుంది. తక్కువ వోల్టేజీ వల్ల ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశాలుంటాయి. వైద్యాధికారుల నుంచి సూచనలు పొందుతూ ప్రథమ చికిత్స అందించాలి.

**విషపదార్థాలు తిన్నప్పుడు..**

మేతకు వెళ్లేటప్పుడు కొన్ని సార్లు పశువులు విషపూరితమైన పదార్థాలు తింటాయి. విష పదార్థాలు తిన్న మూగ జీవాలకు బొగ్గు పొడిని నీటిలో కలిపి తాగించాలి. చింతపండు నీళ్లు కూడా కలిపి తాగించవచ్చు. దీని వల్ల విషం కొంత విరుగుడు అవుతుంది. అదేవిధంగా వైద్యాధికారుల సలహాలను తీసుకొని ప్రథమ చికిత్స చేయాలి. కొంత సమయం ఉండడం వలన వైద్యాధికారి చికిత్స చేసేందుకు అవకాశం ఉంటుంది.

**వైద్యులను సంప్రదించాలి..**



పశువులు అనుకోని ప్రమాదాలకు గురైనప్పు డు రైతులు గాబరపడకుండా వెంటనే పశు వైద్యాధికారులకు సమాచారమందించాలి. అక్క డికి సమాచారం అందిన వెంటనే ఘటన స్థలంలో చేరుకొని వైద్యం అందిస్తాం. పశువులు విద్యుత్ ప్రమాదానికి గురైనప్పుడు వాటిని తాకే ప్రయ త్నం చేయద్దు.

**- విఠల్, పశువైద్యాధికారి(భైంసా)**



భైంసాలో పోలీసు బందోబస్తు

## భైంసాలో భారీ పోలీసు బందోబస్తు

భైంసా, డిసెంబర్ 3 : భైంసాలో ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా పట్టణంలో భారీ పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఎలాంటి ర్యాలీలు, మీటింగ్‌లు సంబంధిత కార్యక్రమాలను నిషేధించారు. ప్రధాన కూడళ్లలు భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

## బీజేపీ విజయోత్సవ ర్యాలీ

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 3 : నిర్మల్ బీజేపీ అభ్యర్థి ఏలేటి మహేశ్వర్ రెడ్డి అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించడంతో బీజేపీ శ్రేణులతో కలిసి కౌంటింగ్ కేంద్రం వద్ద సంబురాలు జరుపుకున్నారు. స్థానిక పాల్‌టెక్నిక్ కళాశాల నుంచి మహేశ్వర్ రెడ్డి నివాసం వరకు భారీ ర్యాలీ తీశారు. ఈ ర్యాలీ మంచిర్యాల్ చౌరస్తా, పాత కలెక్టరేట్, బస్టాండ్ మీదుగా ఇంటి వరకు ర్యాలీ కొనసాగింది. యువత నృత్యాలు చేస్తూ ర్యాలీ కొనసాగించగా..గెలుపొందిన మహేశ్వర్ రెడ్డిని పలువురు పూలమాల శాలువాతో ఘనంగా సన్మానించారు.



బీజేపీ ర్యాలీలో పాల్గొన్న నాయకులు

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఆలయ ప్రాంగణంలో పూర్వ విద్యార్థులు

కుంటాల, డిసెంబర్ 3 : కుంటాలలో ఎస్ఎస్‌సీ 1986-87కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం కుంటాలలోని గజ్జలమ్మ ఆలయ ప్రాంగణంలో కలుసుకున్నారు. పాఠశాలలో చదివిన స్మృతులను నెమరు వేసుకున్నారు. ఒకరినొకరు అప్యాయతగా పలకరించుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ సంబురాలు

కుంటాల, డిసెంబరు, 3 : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఆ పార్టీ శ్రేణులు మండల వ్యాప్తంగా సంబురాలు చేసుకున్నారు. మండల కేంద్రంలో మలిదశ ఉద్యమకారుడు శ్రీకాంతా చారి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం కాంగ్రెస్ శ్రేణులు సంబురాలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జుట్టు లక్ష్మణ్, కర్ల బక్కయ్య, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కుంటాల : శ్రీకాంతా చారి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



పడి పూజ నిర్వహిస్తున్న అయ్యప్ప భక్తులు

## ఘనంగా మహా పడిపూజ

కుంటాల, డిసెంబర్ 3 : వాసవి విద్యాసంస్థ ప్రతియేటా మహా పడిపూజ నిర్వహిస్తారు. ఆదివారం ద్విశతాధిక ప్రతిష్ఠాపనచార్యులు గురుమంచి చంద్రశేఖర శర్మ ఆధ్వర్యంలో అయ్యప్ప మహా పడిపూజను కల్లూర్‌లోని కళాశాల ఆవరణలో జరిపారు. ఈ కార్యక్రమానికి అయ్యప్ప మాలదారులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

## ప్రజా తీర్పును శిరసా వహిస్తా


భైంసా, డిసెంబర్ 3 : ప్రజా తీర్పును శిరసా వహిస్తానని మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ఓట్లేసిన ఓటర్లందరికీ, తన కోసం కష్టపడ్డ ప్రతి ఒక్క కార్యకర్తకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్లు శిక్షణ

సారంగాపూర్, డిసెంబర్ 3 : మండలంలోని చించోలి(బీ) గండిరామన్న అర్బన్ పార్కులో ఆదివారం ఫారెస్టు సెక్షన్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. గండిరామన్న హరిత వనంలో కోతుల పునరావాస కేంద్రాన్ని సందర్శించి పనులను దగ్గరునుండి పరిశీలించారు. దూపాల ఫారెస్టు అకాడమీ కోర్స్ డైరెక్టర్ గంగారెడ్డి, రాంకిషన్ యాదవ్, డీఎఫ్‌వో జైపాల్‌రెడ్డి, ఎఫ్ఆర్వో వేణు గోపాల్, ఎఫ్ఎస్వో అస్సర్ పాల్గొన్నారు.

# నేటి నుంచి కుభీర్‌లో సప్తహ వేడుకలు

- ముమ్మర ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీ
- సుందరంగా ఆలయం ముస్తాబు



కుభీర్ లోని శ్రీవిఠలేశ్వరాలయం

కుభీర్, డిసెంబర్ 3 : కుభీర్‌లోని పవిత్ర పున్యక్షేత్రమైన శ్రీవిఠలేశ్వరాలయంలో సోమవారం నుంచి సప్తహ వేడుకలు ప్రారంభం కానున్నాయి. ఆలయ కమిటీ వేడుకలకు ఆలయాన్ని సుందరంగా తీర్చి దిద్దింది. అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు అధ్యక్షుడు నారా పరుశరాం తెలిపారు. కాగా ప్రధాన సంఘాలైన యాదవ, మున్నూరుకాపు సంఘాల ఆధ్వర్యంలో ఈవేడుకలకయ్యే ఖర్చులు భరిస్తాయి. ఆర్యవైశ్య సంఘం ఏడు రోజుల పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తాయి. వందలాది సంవత్సరాల నుంచి ఈవేడుకలు కొనసాగుతూ వస్తున్నాయి. వచ్చే ఆదివారం రాత్రికి ఆయా గ్రామాల నుంచి వచ్చే భజన దిండీలు జాగారం చేస్తాయి. సోమవారం ఉదయం శోభాయాత్ర, అన్నదానంతో ఈవేడుకలు ముగియనున్నాయి.